క్లుప్తంగా

దివ్యాంగులకు ట్రై సైకిళ్లు

మదనపల్లె సిటీ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం వెలుగు కార్యదర్శి ఉదయమోహన్‌రెడ్డి దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందజేశారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇద్దరు దివ్యాంగులు ట్రై సైకిళ్లు కావాలని కోరారు. స్పందించి దివ్యాంగులైన ఎం.మనోజ్‌కుమార్, డి.వెంకటరమణలకు అందించారు.

రిసోర్స్ కోఆర్డినేటర్‌గా నియామకం

కేవీపల్లె : స్వచ్ఛ భారత్ మిషన్ ఫేస్–2లో కేవీపల్లె మండల రిసోర్స్ కోఆర్డినేటర్‌గా హర్షవర్ధన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని వగళ్లకు చెందిన హర్షవర్ధన్‌రెడ్డిని రిసోర్స్ కోఆర్డినేటర్‌గా నియమిస్తూ కలెక్టర్ నుంచి ఉత్తర్వులు అందాయి. శుక్రవారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

రాతి కూసాల ధ్వంసంపై ఫిర్యాదు

పీలేరు : పొలానికి ఏర్పాటు చేసిన రాతి కూసాలు ధ్వంసం చేసిన సంఘటనపై బాధితురాలు జరీనాబీ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేసింది. బాధితురాలి కథనం మేరకు వివరాలిలావున్నాయి. పీలేరు పట్టణానికి చెందిన జరీనాబీకి మండలంలోని అగ్రహారం పంచాయతీ సర్వే నెంబరు 246/1లో 75 సెంట్లు వ్యవసాయ పొలం ఉంది. ఆ పొలానికి చుట్టూ కంచె ఏర్పాటు చేసుకోవడానికి రాతి కూసాలు ఏర్పాటు చేసుకుంది. అయితే గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు రాతి కూసాలు ధ్వంసం చేశారు.

గంజాయి నిందితులపై సస్పెక్ట్ షీట్

గుర్రంకొండ: గంజాయి కేసులో నిందితులపై సస్పెక్ట్‌షీట్ ఓపెన్ చేశామని ఎస్‌ఐ దిలీప్‌కుమార్ అన్నారు. శుక్రవారం గుర్రంకొండ పట్టణంలో కడప– బెంగళూరు జాతీయ రహదారిపై వేగనిరోధక స్టాపర్‌లను పలుచోట్ల ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా పోలీస్‌స్టేషన్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గంజాయి కేసులో ఇప్పటికే రెండుసార్లు జైలుకు వెళ్లివచ్చిన 17 మందిపై జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సస్పెక్ట్ షీట్ వేశామన్నారు. గంజాయి మత్తులో అనైతిక కార్యకలాపాలకు పాల్పడకుండా చట్టపరంగా తగు చర్యలు తీసుకొంటామన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ నరసింహులు, హెడ్‌కానిస్టేబుళ్లు రమణ, బాలసుబ్రమణ్యం, శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

మాదిగల ఆత్మగౌరవానికి ప్రతీక ఎమ్మార్పీఎస్

కేవీపల్లె : మాదిగల ఆత్మ గౌరవానికి ఎమ్మార్పీఎస్ ప్రతీక అని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లాల కన్వీనర్ దుద్దు రామకృష్ణ అన్నారు. శుక్రవారం మండలంలోని తువ్వపల్లెలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, మందకృష్ణమాదిగ జన్మదినం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదిగలు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాల్లో అభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు వెంకటరమణ, వెంకటేష్, చిన్నరాయుడు, వీరాంజనేయులు, రామాంజులు, ఆనంద్, హేమంత్, ఆంజినేయులు, రవి, శ్రీనివాసులు, మాతయ్య, జ్ఞానేంద్ర, బాలాజి పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామం జెడ్పీ హైస్కూల్ రోడ్డులో తాగునీటి చేతి పంపు ఏర్పాటుతో సమస్య పరిష్కారమైంది. గ్రామంలోని హైస్కూల్ రోడ్డు పరిసర ప్రాంతంలో బోరు ఉండేది. నీరు తక్కువగా ఉండడంతో సమస్య నెలకొంది. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని ఎట్టకేలకు శుక్రవారం చేతిపంపును బోరుకు ఏర్పాటు చేయడంతో నీటి సమస్య పరిష్కారమైంది. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కల్యాణి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ వెంకట్రమణ, పంప్ వర్కర్ యూసూఫ్‌లు పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ


పెద్దమండ్యం: స్థానిక పోలీస్ స్టేషన్‌ను మదనపల్లె డీఎస్పీ కె. కేశప్ప శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసులపై ఆరా తీశారు. స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకొన్నారు. నాటుసారా తయారీ, విక్రయాలు, జూదం, కోడిపందెం జరగకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రామాంజనేయుడు, ఏఎస్‌ఐ ఇషాక్, సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు బ్రూసెల్లోసిస్ నివారణ టీకాలు

పెద్దమండ్యం: పశువుల్లో బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ కోసం టీకాలను వేస్తున్నట్లు పశువైద్యాధికారి షేక్ ఉస్మాన్ తెలిపారు. శుక్రవారం మండలంలోని ముసలికుంట రైతు భరోసా కేంద్రంలో పశువిజ్ఞానబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పశువులకు బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని సర్పంచ్ జయమ్మతో కలిసి ప్రారంభించారు. 4 నెలల నుండి 8 నెలల వయస్సు ఉన్న ఆడ దూడలకు ఈ టీకాలు వేయాలన్నారు. ఈ నెల 20 వరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పశుపోషణ, వాటి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. పాడి రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

రాజన్నా.. ఊరూరా నీజ్ఞాపకాలే

- రూ. 265 కోట్లతో సాగు, తాగునీటి ప్రాజెక్టులు
- రూ. 83.62 కోట్ల మేర రైతు రుణమాఫీ
- 20400 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు
- 26250 మంది పింఛన్లు పంపిణీ
- నేడు మహానేత జయంతి





రాజశేఖర్‌రెడ్డి హాయంలో గుర్రంకొండలో పట్టణంగా నిర్మించిన 630 ఇందిరమ్మ ఇళ్లు , రూ. 3 కోట్లతో నిర్మించిన మార్కెట్‌యార్డు (ఫైల్)

గుర్రంకొండ: జలయజ్ఞ ప్రదాత మహానేత దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్‌రాజశేఖర్‌రెడ్డి చొరవతో పీలేరు నియోజకవర్గంలో ప్రజలకు, రైతులకు సాగు, తాగునీరు అందించే ఎన్నో ప్రాజెక్టులు నిర్మించారు. రూ. 265 కోట్లతో సాగు, తాగునీరు ప్రాజెక్టులు, సమ్మర్ స్టోరేజి ట్యాంకులను నిర్మించారు. ఒకేసారి రూ. 83.62 కోట్ల మేరకు నియోజకవర్గంలోని రైతులకు రుణమాఫీ చేసి ఘనత ఆయకే దక్కింది. 20,400 ఇందిరమ్మ నియోజకవర్గానికి మంజూరు చేశారు. 26250 మందికి పింఛన్లను పంపిణీ చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు మహానేత.

ప్రాజెక్టుల నిర్మాణం

మహానేత ముఖ్యమంత్రిగా ఎంపికైన అనంతరం నియోకవర్గం అభివృద్ధి వైపు పరుగులు తీసింది. నియోజకవర్గంలోని కేవిపల్లె మండలంలో రెండు ప్రాజెక్టులను ఏర్పాటు చేశారు. రూ. 200కోట్లతో అడవిపల్లె రిజర్వాయర్, ఝరీకోన ప్రాజెక్టులను నిర్మించారు. తద్వారా నియోజకవర్గంలోని కేవిపల్లె, కలకడ, కలికిరి మండలలాతో పాటు జిల్లాలోని 13 మండలాలకు తాగునీరు సరఫరా చేసేందకు వీటని ఏర్పాటు చేశారు. రెండు టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన ఈ ప్రాజెక్టులు తాగునిరుతో పాటు పలు మండలాలకు సాగునీరు అందిస్తున్నాయి. పీలేరు పట్టణ ప్రజల దహార్తీ తీర్చడానికిగానూ రూ.15 కోట్లతో సమ్మర్ స్టోరేజి ట్యాంకు నిర్మాణం చేపట్టారు. పీలేరు మండలంలోని పరిసర ప్రాంతాల్లో భూగర్భజలాలను పెంపొందించడానికి గార్గేయ ప్రాజెక్టును రూ. 45 కోట్లతో నిర్మించారు. తద్వారా సుమారు 10కిలోమీటర్ల మేరకు భూగర్భజలాలు పెరగనున్నాయి. వాల్మీకీపురం పట్టణ, మండల ప్రజల తాగునీటి సౌకర్యార్థం రూ. 5 కోట్లతోభోగంపల్లె రిజర్వాయర్‌ను నిర్మించారు. పనులన్ని ఇప్పటికే పూర్తిచేసి పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెచ్చారు.

పేదలకు ఆసరా ఇందిర్మమ ఇళ్లు, పింఛన్లు

నియోజకవర్గంలోని నిరుపేద ప్రజలకు ఆసరా కల్పించేందకుగానూ పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇళ్లను అప్పట్లో మంజూరు చేశారు. మండల చరిత్రలో ఒకేసారి మండల కేంద్రమన గుర్రంకొండలో రూ.2.54 కోట్లతో 630 ఇందిరమ్మ ఇళ్లను ఒకేసారి ఏర్పాటు చేశారు. అందులో అందరికి ఇళ్లస్థలాలతో పాటు ఇళ్లు కూడా ఉచితంగా నిర్మించి ఇచ్చారు. పీలేరులో 2500, కలికిరిలో 1000, వాల్మికీపురం 730తో జాతీయ రహదారిపక్కల్లో ఇందిరమ్మ కాలనీలు ఏర్పాటు చేశారు. వీటితో పాటు గుర్రంకొండలో 2800, వాల్మికీపురంలో 2570, కలకడలో 3000, కలికిరిలో 2600, పీలేరులో 2120, కేవిపల్లెలో 2450 మొత్తం 20,400 ఇందిర్లను మంజూరు చేయడంతో పాటు ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకొన్నారు. గుర్రంకొండలో 4250, కేవిపల్లెలో 3650, పీలేరులో 4600, కలికిరిలో 5200, వాల్మికీపురంలో 5500,కలకడలో 3050 మొత్తం 26250 మందికి వివిధ రకాల పింఛన్లను మంజూరు చేసిన ఘనత ఆయనకే దక్కింది.

రైతుల పాలిట పెన్నిధి, ఆపద్బాంధవుడు

నియోజకవర్గంలోని ఆరు మండలాల రైతుల పాలిట పెన్నిధి, ఆపద్బాంధవుడిగా మారి వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాడు మహానేత. అప్పటివరకు రుణబంధాలు, అప్పుల్లో చిక్కుకున్న రైతులకు ఒక్కసారిగా విముక్తి కల్పించాడు. బ్యాంకు రుణాలు, వ్యవసాయ కరెంటు బకాయిలన్నింటిని ఒకే విడత మాఫీ చేశాడు. గుర్రంకొండలో రూ. 12.4 కోట్లు, వాల్మీకీపురంలో రూ. 14.16కోట్లు, కలికిరిలో 16.8కోట్లు, కలకడలో రూ. 8.10కోట్లు, కేవిపల్లెలో రూ. 8.16 కోట్లు, పీలేరులో రూ. 24కోట్లు మొత్తం రూ. 83.62కోట్ల మేరకు రుణాలు, కరెంటు చార్జీలను మాఫీ చేశారు.

రూ.15 కోట్లతో మార్కెట్‌యార్డులు

గుర్రంకొండలో రూ. 3 కోట్లతో మార్కెట్‌యార్డు నిర్మించారు. అందులో తాగునీటి సౌకర్యం, మార్కెట్‌యార్డు కార్యాలయం, 35 గదులు, మరుగుదొడ్లు, హోటల్ కూడా సౌకర్యాలు కల్పించారు. వాల్మీకీపురం, చింతపర్తి గ్రామల్లో రూ. 6 కోట్లతో ఆధునికి సౌకర్యాలతో మార్కెట్‌యార్డు భవనాలను, మండీలను నిర్మించారు. కలికిరిలో రూ. 6 కోట్లతో మార్కెట్‌యార్డు భవనాలు, మండీలు, అతిథి గృహాలను నిర్మించారు. దీంతో రైతులు పండించిన పంటలను దూర ప్రాంతాలకు తీసుకెళ్లి విక్రయించే దుస్థితి తప్పింది.

రూ.52.5కోట్లతో అభివృద్ధి పనులు

నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో దివంగతం ముఖ్యమంత్రి హాయాంలో అభివృద్ధి పనులు పరుగులు తీశాయి. ప్రభుత్వ భవనాలు, తారురోడ్లు, సిమెంటు రోడ్లు, కల్యాణమండపాలు, విద్యుత్ సబ్‌స్టేషన్లు, విద్యాలయాలు ఎన్నో ఏర్పాటు అయ్యాయి. వీటి ఏర్పాటు కోసం గుర్రంకొండలో రూ. 6.5 కోట్లు, పీలేరులో రూ. 10.6 కోట్లు, వాల్మీకీపురంలో రూ. 8.3 కోట్లు, కలకడలో రూ. 6.6 కోట్లు, కలికిరిలో రూ. 11.8 కోట్లు, కేవిపల్లెలో రూ. 8.7 కోట్లు మొత్తం రూ. 52.5 కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయి.

పప్పుజాతి పశుగ్రాసంతో అధిక పాలదిగుబడి

కలికిరి: పప్పుజాతి పశుగ్రాసంతో పాడి ఆవులు అధిక పాలదిగుబడినిస్తాయని కలికిరి ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు వెంకటమునినాయుడు తెలిపారు. పశుగ్రాస వారోత్సవాలలో భాగంగా మండలంలోని మునెళ్ళపల్లి రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పప్పుజాతి పశుగ్రాసమైన హెడ్జి లూసర్న్, స్టైల్లోహేమాట పశుగ్రాసం రైతులు పెంచుకోవాలన్నారు. పశువులకు పచ్చిగడ్డితో పాటు ఎండుగడ్డిని కూడా మేతగా ఇవ్వాలని పశువైద్యాధికారి గిరినాథరెడ్డి అన్నారు. ఆర్‌బీకేలో అందుబాటులో ఉన్న పశుగ్రాస విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశు సహాయకులు వాసుదేవరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు కృషి

పీలేరు : పీలేరు పట్టణ వాసులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి కృషి చేస్తున్నట్లు సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. శుక్రవారం స్థానిక బీవీరెడ్డి నగర్, మార్కెట్‌యార్డు, రైల్వేస్టేషన్ వద్ద కొత్తగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో లోఓల్టేజీ సమస్య పరిష్కరించడానికి ట్రాన్స్‌కో అధికారులతో చర్చించి పాత ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ హరిత, నాయకులు శ్రీనాథరెడ్డి, కుచ్చు అల్లాబక్ష్, పెద్దోడు, ఆబీద్, రమణ, ఏడీ పురుషోత్తం, ఈవో ప్రసాద్‌రెడ్డి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రవి తదితరులు పాల్గొన్నారు.

పీలేరు రూరల్ : ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యపరచాలని సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. శుక్రవారం స్థానిక బోదేషావలి దర్గాలో ప్రాంగణంలో 5వ వీవో సంఘమిత్రలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీలేరు గ్రామ పంచాయతీ పరిధిలో జరిగిన అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి వివరించారు.

ఎల్లమ్మ తిరునాలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి జాతర ప్రారంభం
- నాలుగు రోజుల పాటు ఉత్సవాలు



గ్రామ దేవత ఎల్లమ్మ

కలికిరి: పట్టణంలో వెలసిన కలికిరి గ్రామ దేవత, భక్తులు కోర్కెలు తీర్చే చల్లని తల్లి ఎల్లమ్మ తిరునాల శనివారం నుంచి ప్రారంభమవుతుందని ఆలయ ధర్మకర్త రెడ్డివారి అశోక్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నాలుగు రోజుల పాటు వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించే జాతరలో అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచే కాకుండా, ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారని వివరించారు. జాతరలో భాగంగా ఆలయ ఆవరణంలో శనివారం రాత్రి అమ్మవారి హరికథా కాలక్షేపం, జాగరణ జరుగుతుందన్నారు. ఆదివారం ఉదయం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని తేరులో ప్రత్యేక అలంకరణ మధ్య కలికిరి పట్టణంలో ఊరేగింపు, తదుపరి సిద్దపూజ, అనంతరం మధ్యాహ్నం నుంచి భక్తులు అమ్మవారికి దీలు, బోనాల సమర్పణ ఉంటుందని ఆయన తెలిపారు. సోమవారం నుంచి అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం, రాత్రి లంకాదహనం, తేరులో పుష్పపల్లకి సేవ నిర్వహిస్తామన్నారు. మంగళవారం జరుగు పార్వేట ఉత్సవంతో జాతర ముగుస్తుందని చెప్పారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ధర్మకర్త కోరారు. జాతరకు పీలేరు ఆర్టీసీ డిపో నుంచి 28 ప్రత్యేక సర్వీసులను నడపనున్నట్లు డీఎం కె.కుమార్ తెలిపారు.

పేదలకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

నిమ్మనపల్లె : సంక్షేమ పథకాలను అమలుచేస్తూ పేదలకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిలుస్తోందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. శుక్రవారం తవళం పంచాయతీలోని చౌకిళ్లవారిపల్లె, చింతలవారిపల్లె గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. సింగిల్‌విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, ఆర్‌బీకే చైర్మన్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, మండల వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ ఆర్.ఐ.రమణారెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే ప్రతి ఇంటికి వెళ్లి లబ్ధిదారులను కలిశారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల ద్వారా పొందిన సాయాన్ని వివరించారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు గ్రామాల్లో అవసరమైన సిమెంట్‌రోడ్లు, మురుగునీటికాలువల నిర్మాణం, మంచినీటి కొళాయిల ఏర్పాటు, పింఛన్లు, రేషన్‌కార్డుల మంజూరు, రెవెన్యూ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. సమస్యల పరిష్కరించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

రాష్ట్రాభివృద్ధి దేశానికే ఆదర్శం

పీలేరు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి దేశానికే ఆదర్శమని మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక తిరుపతి రోడ్డులోని రెడ్డి అండ్ రెడ్డి కాలనీ తదితర ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ఇంటింటి వద్దకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. ఇంకా ఏవైనా ప్రభుత్వం నుంచి పథకాలు అందాల్సి ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా కుల మతాలకు అతీతంగా, రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చుతున్న ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యువ పారిశ్రామిక వెత్త రాకేష్‌రెడ్డి, నాయకులు దండు జగన్‌మోహన్‌రెడ్డి, కంభం భాస్కర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, బి.డి. నారాయణరెడ్డి, హుమయూన్, చలపతి, విజయశేఖర్‌రెడ్డి, ఆనంద్, సుబ్బారెడ్డి, సాంబశివారెడ్డి, నరసింహారెడ్డి, శ్రీనాథరెడ్డి, సురేంద్రరెడ్డి, మహేష్‌రెడ్డి, షాకీర్, దామోదర్‌రెడ్డి, ఉదయ్, అరుణ పాల్గొన్నారు.

పాలిటెక్నికల్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

పీలేరు : స్టేట్ బోర్డు ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ విడుదల చేసిన పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం ఫలితాల్లో స్థానిక ఎంజేఆర్ కళాశాల విద్యార్థులు విశేష ప్రతిభ చూపినట్లు చైర్మన్ ఎం.పి. అవినాష్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. మొదటి సంవత్సరం ఫలితాల్లో 1000 మార్కులకు సీఎంఈలో కె. లావణ్య 955, టి. భవాని 919 మార్కులు, అలాగే ఈసీఈలో సి. మానస 895 మార్కులతో ప్రతిభ చూపినట్లు వివరించారు. రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

అక్రమ నిర్మాణాలు తొలగింపు

పీలేరు రూరల్ : స్థానిక మదనపల్లె మార్గంలోని ఏపీఐఐసీ–3 జగనన్న లేఅవుట్‌లో అక్రమ నిర్మాణాలు తొలగించినట్లు తహసీల్దార్ కె. ధనుంజయలు తెలిపారు. తహసీల్దార్‌కు అందిన ఫిర్యాదు మేరకు శుక్రవారం జగనన్న లేఅవుట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీఐఐసీ–3 జగనన్న లేఅవుట్‌లో ప్రభుత్వ అవసరాలకు కేటాయించిన స్థలంలో గుర్తు తెలియని వ్యక్తులు 34 గుణాంతాలు వేసినట్లు గుర్తించి జేసీబీ తొలగించినట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా ఎక్కడైనా ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వీఆర్వో సురేష్‌కుమార్‌రెడ్డి, సర్వేయర్లు రెడ్డెప్ప, కిరణ్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించండి



వ్యాపారులతో ట్రాఫిక్ నిబంధనలపై మాట్లాడుతున్న డీఎస్పీ కేశప్ప

మదనపల్లె : పట్టణంలో రోజురోజుకు పెరిగిపోతున్న ట్రాఫిక్ కష్టాలు, ఇబ్బందులను నియంత్రించేందుకు ప్రజలు, వ్యాపారులు సహకరించాలని డీఎస్పీ కేశప్ప కోరారు. శుక్రవారం ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యల్లో భాగంగా వన్‌టౌన్ స్టేషన్ పరిధిలోని నెహ్రూబజార్, శాస్త్రివీధి, అప్పారావువీధి, ఆర్.ఆర్.స్ట్రీట్‌కు చెందిన వ్యాపారస్తులతో సీఐ మహబూబ్‌బాషాతో కలిసి డీఎస్పీ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ నిబంధనల దృష్ట్యా అప్పారావువీధిలో హోల్‌సేల్ వ్యాపారులు తమకు సరుకును తీసుకువచ్చే లారీలను రాత్రి.9.30 గంటల నుంచి మరుసటిరోజు ఉదయం 5 గంటలలోపు అన్‌లోడ్ చేసుకోవాలన్నారు. పగటిపూట రద్దీ వేళల్లో లారీలను అడ్డుగా నిలిపి ప్రజలకు ఇబ్బందులు కలుగజేస్తే ఎట్టిపరిస్థితుల్లోనూ సహించేదిలేదన్నారు. వ్యాపారులపై కేసులు నమోదుచేయడంతో పాటుగా వాహనాలను సీజ్ చేస్తామన్నారు. అలాగే రాత్రి 10.30కి కచ్చితంగా అన్ని దుకాణాలు మూసివేయాలన్నారు. ఆర్.ఆర్.స్ట్రీట్‌లో రోడ్డు విస్తరణ తక్కువగా ఉన్నందున వన్ వే అమలు చేస్తున్నామని, అలాగే దుకాణాల ముందు వాహనాలను రోడ్డుకు ఒకరోజు ఎడమవైపుకు, మరోరోజు కుడివైపుకు పార్కింగ్ చేయాలన్నారు. షాపుల ముందు నో పార్కింగ్ బోర్డులు, వన్‌సైడ్ పార్కింగ్ బోర్డులు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ప్రతి దుకాణంలోనూ వ్యాపారులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. వన్‌టౌన్ సీఐ మహబూబ్‌బాషా మాట్లాడుతూ.. ట్రాఫిక్ కంట్రోల్‌కు వ్యాపారులు, ప్రజలు సహకరించాలన్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్‌ఐ హరిహరప్రసాద్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.







అర్హులకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం







మదనపల్లె : ప్రజలకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా, వాల్మికిపురం: సర్టిఫికెట్లను అందిస్తున్న కార్పొరేషన్ డైరెక్టర్లు అబ్దుల్ కలీమ్, నరసింహులు, తంబళ్లపల్లెలో... నాయకులు

మదనపల్లె : అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. శుక్రవారం మండలంలోని దుబ్బిగానిపల్లె, మున్సిపాలిటీలో ఎస్వీఆర్ లేఅవుట్, మోతీనగర్, ఎస్వీఆర్ స్ట్రీట్, శాస్త్రివీధి, బాకావానితోట, నెహ్రూబజార్, యూనియన్ ఆఫీస్‌రోడ్ సచివాలయాల పరిధిలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎంపీడీఓ భానుప్రసాద్, కమిషనర్ కే.ప్రమీల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ముంగిటకే పాలన తెచ్చి, అధికారులను ఇంటివద్దకే వచ్చి సేవలు అందించేలా సచివాలయ, వలంటీర్ వ్యవస్థను ప్రవేశపెట్టారన్నారు.

నిమ్మనపల్లె : సమస్యల పరిష్కారానికే జగనన్న ప్రభుత్వం సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. శుక్రవారం నిమ్మనపల్లెలో జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎంపీపీ నరసింహులు, సింగిల్‌విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, రమణారెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, రామమోహన్‌రెడ్డి, జయప్రకాష్‌రెడ్డి, మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వరరెడ్డి, తహసీల్దార్ మంజుల, ఎంపీడీఓ శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకిపురం: రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వ పాలన ఉంటేనే సంక్షేమ పథకాలు అమలులో ఉంటాయని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్, రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ నరసింహులు అన్నారు. శుక్రవారం మండలంలోని గండబోయనపల్లిలో తహసీల్దార్ ఫిరోజ్‌ఖాన్ సారథ్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. అలాగే మండలంలోని బూడిదవేడులో ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు.

రామసముద్రం: మండలంలోని చొక్కాండ్లపల్లి, కాప్పల్లె పంచాయతీల్లో సర్పంచ్‌లు రుక్మిణమ్మ, నారాయణమ్మల అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ఎమ్మెల్యే నవాజ్‌బాషా హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీపీ కుసుమకుమారి , జెడ్పీటీసీ హెచ్ రామచంద్రారెడ్డి, మండల కన్వీనర్ భాస్కర్‌గౌడ్, సింగిల్‌విండో అధ్యక్షుడు కేశవరెడ్డి, వైస్ ఎంపీపీ రమణారెడ్డి, గంగాధర్‌నాయుడు, నందకిషోర్‌రెడ్డి, బాలాజిరెడ్డి, వీరేగౌడు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం: పథకాలను ప్రజలకు చేరువ చేసేందుకే జగనన్న సురక్ష కార్యక్రమం అందుబాటులోకి తీసుకువచ్చారని ఎంపీపీ మహమూద్,జెడ్పీటీసీ శివన్న, జేసీఎస్ కన్వీనర్ డ్రిప్ రమణ తెలిపారు. కార్యక్రమం ప్రారంభానికి ముందు ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందిన సర్పంచ్ బాబురెడ్డి చిత్ర పటానికి నివాళులు అర్పించారు.

తంబళ్లపల్లె: మహాత్మాగాంధీ కన్న గ్రామస్వరాజ్యం కలలను నిజం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమపాలన సాగిస్తున్నారని స్పెషల్ ఆఫీసర్ జిల్లా అధికారి సందప్ప తెలిపారు. శుక్రవారం గుండ్లపల్లె గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనడం విశేషం.

పెద్దమండ్యం: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ఉచితంగా ప్రభుత్వ సేవలు అందిస్తున్నట్లు జిల్లా మైన్స్, జయాలజీ అధికారి రవి అన్నారు. మండలంలోని ముసలికుంట గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం సర్పంచ్ టి జయమ్మ, సీ గొల్లపల్లె గ్రామ సచివాలయం వద్ద కంటి విశ్వనాధరెడ్డిల అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు.

కేవీపల్లె : జగనన్న సురక్ష కార్యక్రమం పేదలకు వరం లాంటిదని ఎంపీపీ ఈశ్వరమ్మ అన్నారు. శుక్రవారం మండలంలోని ఎంపీపల్లె గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు.

కలకడ : పేద ప్రజలను ఆదుకోవడమే లక్ష్యంగా జగనన్న సురక్ష కార్యక్రమం ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు ఎంపీపీ శ్రీదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని కదిరాయచెరువు దిగువపాళెం, ఎగువతాండా పంచాయతీలలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు.